సాక్షి
గుంటూరు
గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



'ఆదాయ' కార్యాలయం ప్రారంభం

పాతగుంటూరు: నగరంపాలెంలో ఆదాయ పన్ను శాఖ నూతన ప్రధాన కార్యాలయాన్ని బుధవారం ఆ శాఖ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సస్ మెంబర్ సంగీతా సింగ్ వర్చువల్‌గా ప్రారంభించారు.



ఆధార్ కిట్లు అందజేత

గుంటూరు వెస్ట్: కలెక్టరేట్ సిబ్బందికి జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, ఎమ్మెల్యే కిలారి, ఎమ్మెల్సీ డొక్కాతో కలిసి జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాల్ రెడ్డి ఆధార్ కిట్లు అందజేశారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్ : గుంటూరు జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదని వైద్య ఆరోగ్య శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

యువ లాయర్లకు అండ

- జిల్లాలో వైఎస్సార్ లా నేస్తం ద్వారా 166 మందికి రూ.2.98 కోట్లు జమ
- కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి
- హర్షం వ్యక్తం చేస్తున్న యువ న్యాయవాదులు



నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీలు డొక్కా, హనుమంతరావు, జెడ్పీ చైర్మన్ హెనీక్రిస్టినా, ఎమ్మెల్యేలు మద్దాళి, కిలారి, మేయర్ కావటి, పోలూరి తదితరులు

గుంటూరు వెస్ట్: లా విద్య పూర్తయిన తరువాత వృత్తిలో నిలదొక్కుకునేందుకు ఇంట్లో ఆర్థికంగా ఆధారపడటం చాలా వరకు యువ లాయర్లకు ఇబ్బందులు కలిగిస్తోంది. దీన్ని గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ లా నేస్తం ద్వారా ప్రతి నెలా రూ.5 వేలు చొప్పున మూడేళ్లు అందించడం శుభ పరిణామమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి నిర్వహించిన వైఎస్సార్ లానేస్తం పథకం నగదు జమ కార్యక్రమంలో స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 166 మందికి రూ.2.98 కోట్లు నేరుగా ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. 2019 అక్టోబర్ నుంచి ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు జిల్లాలో 539 మందికి సుమారు రూ.5 కోట్లు అందజేశామన్నారు.

యువ న్యాయవాదులకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం తాను న్యాయవాది వృత్తి స్వీకరించిన సమయంలో ఆదాయం లేక ఆహారం కూడా లేకుండా తిరిగిన రోజులు ఉన్నాయన్నారు. దేశంలో న్యాయవాదులకు ఈ విధమైన సాయం అందించిన ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. న్యాయవాదులందరికి వారి వృత్తి చేసుకునే ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు.

హామీలన్నీ అమలు చేసిన సీఎం

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, ఎమ్మెల్యేలు కిలారి వెంకటరోశయ్య, డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి క్రమంతప్పకుండా అమలు చేస్తున్నారన్నారు.

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, స్టేట్ లీగల్ సెల్ కోర్ కమిటీ సభ్యుడు పోలూరి వెంకటరెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పఠాన్ ముంతాజ్‌బేగం, పూసల, కృష్ణబలిజ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పోలా భవాని, నెడ్‌క్యాప్ రాష్ట్ర డైరెక్టర్ కొత్తా చినప్పరెడ్డి లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివ న్నారాయణశర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదన్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉపయోగపడుతుంది



నాకు ఇటీవలే ఈ పథకం మంజూరైంది. ఒక్క రూపాయి కూడా ఎవ్వరికి ఇవ్వకుండా అత్యంత పారదర్శకంగా నాకు డబ్బులు అందడం చాలా సంతోషంగా ఉంది. ప్రస్తుతం రాస్తున్న పోటీ పరీక్షలకు ఫీజులు చెల్లించడం, కొత్త పుస్తకాలు కొనుగోలు చేసేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయి. నాకు వేరే ఆదాయం లేదు. ఇంట్లో కూడా ఎవరిని అడగకుండా ఈ డబ్బులు ఉపయోగపడుతున్నాయి.

– ఎం.దుర్గాభవాని, యువ న్యాయవాది, గుంటూరు

ఢిల్లీలో లా పూర్తి చేసి వచ్చాను



నేను ఢిల్లీలో లా చదువుకున్నాను. అక్కడ న్యాయవాదులకు ఎటువంటి పథకాలు గానీ, ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు లేవు. మాది పేద కుటుంబం. గుంటూరు జిల్లాలో ఎన్‌రోల్ అయితే నెలకు రూ.5 వేలు మూడేళ్ల పాటు అందుతాయని చెప్పడంతో ఇక్కడ నమోదు చేయించుకున్నాను. అనుకున్నట్లే ప్రతి నెలా నాకు రూ.5 వేలు అందుతున్నాయి. ఈ విషయం చెబితే నా స్నేహితులు కూడా ఆశ్చర్యపోతున్నారు. ఇదొక్కటే కాదు, చాలా పథకాలు మన రాష్ట్రంలోనే అమలవుతున్నాయి. ఈ సహాయంతో ఉన్నత శిఖరాలకు చేరుకుంటాను.

– డి.షణ్ముఖచక్రవర్తి, యువ న్యాయవాది, గుంటూరు



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్, జేసీ రాజకుమారి

27న సీఎం వైఎస్ జగన్ తెనాలి రాక

- మూడో విడత రైతు భరోసా ఆర్థిక సాయం పంపిణీ, బహిరంగ సభ
- సభాప్రాంగణం, హెలిప్యాడ్‌ను పరిశీలించిన కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

తెనాలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27వ తేదీ తెనాలి పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో బహిరంగ సభ, హెలిప్యాడ్ ప్రాంతాలను బుధవారం సాయంత్రం గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలిశర్మతో కలిసి పరిశీలించారు. హెలిప్యాడ్ కోసం తాలూకా జూనియర్ కాలేజి స్థలాన్ని పరిశీలించారు. సభా ప్రాంగణం కోసం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మార్కెట్ యార్డు కమిటీ పరిపాలన భవనంలో అధికారులతో సమావేశమయ్యారు. ప్రాథమిక పరిశీలన మినహా హెలిప్యాడ్ ఎక్కడనేది ఇంకా నిర్ణయానికి రాలేదు. గురువారం మరోసారి అందరు అధికారులతో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారైందని, ఈలోగా సంబంధిత శాఖలు సన్నాహాలు చేయాలని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు, రోడ్లపై ప్యాచ్ వర్కులను పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈకి సూచించారు. హెలిప్యాడ్ వద్ద గ్రీన్ రూమ్, టెంట్లను ఏర్పాటు చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాలన్నింటినీ భాగస్వాములను చేయాలని కలెక్టర్ జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లును ఆదేశించారు. రైతులు సభకు వచ్చి వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ, నాలుగో సంవత్సరం మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా నగదును రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారులకు బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేస్తారని వెల్లడించారు. ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ బి.నిర్మల, జిల్లా అడిషనల్ ఎస్పీ అనిల్‌కుమార్, జిల్లా ఉద్యాన అధికారి సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రావణ్‌కుమార్, తెనాలి డీఎస్పీ డాక్టర్ స్రవంతిరాయ్, తహసీల్దార్ కె.రవిబాబు, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ ఈ.అన్నపూర్ణ, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, ఎంపీడీవో విజయాలక్ష్మీ, మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'బాబు నన్ను చంపాలని చూశాడు'

- నాడు మీడియా వేదికగా ఆరోపణలు
- నేడు అదే చంద్రబాబు గూటికి కన్నా..
- కన్నా రాకను వ్యతిరేకిస్తున్న రాయపాటి వర్గం
- కన్నాను స్వాగతించని జిల్లా తెలుగుదేశం నేతలు
- సత్తెనపల్లి, గుంటూరు వెస్ట్‌లో తన వర్గాలను కూడగడుతున్న కన్నా
- అసంతృప్తిలో దేశం నేతలు



టీడీపీలో చేరబోతున్న కన్నా లక్ష్మీనారాయణకు శుభాకాంక్షలు చెబుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'చంద్రబాబు నన్ను, వంగవీటి రంగాను చంపడానికి స్కెచ్ వేశాడు. రంగా విషయంలో సక్సెస్ అయ్యాడు. నా విషయంలో ఫెయిల్ అయ్యాడు.. ఇది మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ చంద్రబాబునాయుడును ఉద్దేశించి ఎల్లోమీడియా సాక్షిగా చేసిన వ్యాఖ్యలు. అదే కన్నా నేడు చంద్రబాబు గూటికి వెళ్లడానికి ప్రయత్నించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

అసంతృప్తితో రగిలిపోయి..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సోము వీర్రాజును నియమించినప్పటి నుంచి అసంతృప్తితో రగిలిపోతున్న కన్నా లక్ష్మీనారాయణ తెలుగుదేశం తీర్థం పుచ్చుకునేందుకు తెరవెనుక పావులు కదుపుతూ వచ్చారు. తన చిరకాల ప్రత్యర్థి అయిన రాయపాటి సాంబశివరావుతో కూడా కేసుల విషయంలో రాజీ పడ్డారు. తర్వాత క్రమంలో సొంత పార్టీ బీజేపీపై విమర్శలు చేస్తూ వచ్చారు. అదే సమయంలో తెలుగుదేశం, జనసేన రెండు పార్టీల నాయకులతో సంప్రదింపులు జరుపుతూ వచ్చారు. జనసేన నుంచి నాదెండ్ల మనోహర్ కూడా వచ్చి కన్నాను కలిసి వెళ్లారు. అయితే జనసేన, తెలుగుదేశం పొత్తు ఉంటుందా? చివరి నిమిషంలో ఉండకపోతే ఇబ్బంది పడతామనే ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీలో చేరడానికే నిర్ణయించుకున్నారు. 1989 నుంచి తెలుగుదేశం పార్టీతో పోరాడుతూ వచ్చిన కన్నా లక్ష్మీనారాయణకు ఆ పార్టీ నేతలతో వైరం ఉంది. కన్నా లక్ష్మీనారాయణ, రాయపాటి సాంబశివరావు రెండు వర్గాలుగా జిల్లాలో రాజకీయం చేశారు. నేడు ఆ ఇద్దరు ఒకే ఒరలో ఇముడుతారా? అన్నది సందేహంగా మారింది. మరోవైపు కన్నా లక్ష్మీనారాయణ రాకను తెలుగుదేశం నాయకులతో పాటు కేడర్ కూడా వ్యతిరేకిస్తోంది. కన్నా తెలుగుదేశంలో చేరుతారని ప్రకటించిన తర్వాత మాజీ మంత్రి ఆలపాటి రాజా మినహా ఎవరూ కలవకపోవడం గమనార్హం. కన్నా లక్ష్మీనారాయణ తెలుగుదేశంలో చేరుతున్న సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన బ్యానర్లలో ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేష్ మినహా మరే తెలుగుదేశం నాయకుడి ఫొటోలు వేయకపోవడం పట్ల తెలుగుదేశం నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం నేతలు ఒక్కరు కూడా కన్నా లక్ష్మీనారాయణను స్వాగతిస్తూ ఒక్క ఫ్లెక్సీ కూడా పెట్టకపోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కన్నా రాకపై బహిరంగంగా వ్యాఖ్యానించకపోయినా వ్యతిరేక వర్గం చంద్రబాబునాయుడును కలిసి తమ అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే పార్టీ ఉన్న కష్టకాలంలో ఎవరు వచ్చినా వ్యతిరేకించవద్దని చంద్రబాబు నచ్చజెప్పినట్లు తెలుస్తోంది. కన్నా సత్తెనపల్లి, గుంటూరు పశ్చిమలో ఏదో ఒక స్థానం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఆ దిశగా తన అనుచరులను ఇప్పటి నుంచి సమాయత్తపరుస్తున్నారు. ఇప్పటికే ఈ నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని భావిస్తున్న తెలుగుదేశం నాయకులు కన్నా రాకను వ్యతిరేకిస్తున్నారు. బయట నుంచి వచ్చిన వారికి పెద్దపీట వేస్తే తాము సహాయ నిరాకరణ చేయాల్సి వస్తుందని తెలుగుదేశం నాయకులు తమ అనుచరుల వద్ద వ్యాఖ్యానిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కన్నా రాకతో తెలుగుదేశం పార్టీలో మరో వర్గం ఏర్పడటం ఖాయంగా కనపడుతోంది.

మార్చి 3న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను మార్చి 3వ తేదీ నిర్వహించేందుకు జెడ్పీ సీఈవో జె.మోహనరావు బుధవారం షెడ్యూల్ విడుదల చేశారు. మొత్తం ఏడు స్థాయీ సంఘాలకుగాను 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్నాయి. వీటిలో ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యంతో పాటు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. 3వ స్థాయీ సంఘానికి సంబంధించిన సమావేశం వ్యవసాయంపై జెడ్పీ వైస్‌చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి అధ్యక్షతన జరగనుంది. స్త్రీ–శిశు సంక్షేమంపై తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి అధ్యక్షతన 5వ స్థాయీ సంఘం, సాంఘిక సంక్షేమంపై జెడ్పీ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన 6వ స్థాయీ సంఘ సమావేశం జరగనుంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన స్థాయీ సంఘాల్లో సభ్యులుగా ఉన్న జెడ్పీటీసీలతో పాటు ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకానున్నారు.

సామాజిక విప్లవానికి పునాదులు

- దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సామాజిక న్యాయం పాటించిన ఏకైన సీఎం వైఎస్ జగన్
- 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేటాయించి అందరికీ సమన్యాయం..
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున



మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున, వేదికపై ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మేయర్ కావటి మనోహరనాయుడు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): దేశంలో మరెక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సామాజిక విప్లవానికి తెరతీసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో జాగృతమై బలపడిన బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారంతా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును సామాజికంగా బహిష్కరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు మేలు జరగకుండా ముఖ్యమంత్రి చేపట్టే ప్రతి కార్యక్రమానికి మోకాలడ్డుతున్న చంద్రబాబుకు ఇదే సరైన గుణపాఠమని ఆయన తేల్చి చెప్పారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మంత్రి నాగార్జున మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ తాజాగా ప్రకటించిన 18 మంది ఎమ్మెల్సీల జాబితాలో 14 స్థానాలను ఆయా వర్గాలకే కట్టబెట్టడమనేది దేశ రాజకీయాల్లోనే ఓ కొత్త చరిత్రగా అభివర్ణించారు. బడుగు, బలహీనులను ఇంతగా బలోపేతం చేయడాన్ని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు జీర్ణించుకోలేకపోతున్నారని మంత్రి నాగార్జున ఆరోపించారు.

అన్నివర్గాల అభివృద్ధికి సీఎం జగన్ కృషి..

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలి రోజు నుంచే రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు నడుం బిగించినట్లు చెప్పారు. అందుకోసం ఆయన విద్యకు దూరమైన వర్గాలను గుర్తించి, అందరికీ సమానంగా విద్యావకాశాలను కల్పించి, తదనుగుణంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచి తద్వారా పేదరికాన్ని రూపుమాపడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను అన్ని రంగాల్లో ముందు వరుసలోకి తెస్తున్నట్లు వివరించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా మాట్లాడుతూ కులం చూడకుండా, మతం చూడకుండా, పార్టీల గురించి కూడా ఏమాత్రం పట్టించుకోకుండా అర్హతే ప్రామాణికంగా అందరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ, పరిపాలనలో, నామినేటెడ్ పదవుల్లో, పనుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పెద్ద పీట వేయడం ద్వారా రాష్ట్రంలో నూతన ఒరవడికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాంది పలికినట్లు చెప్పారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో సామాజిక న్యాయం మచ్చుకైనా కానరాదన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), షేక్ రోషన్, అందుగల సంతోష్, బోడపాటి ఉషారాణి, బూసి రాజలత, గీతామందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోక్సో ప్రత్యేక కోర్టు ప్రారంభోత్సవం



పోక్సో కోర్టును ప్రారంభిస్తున్న జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు

తెనాలి: తెనాలిలోని కోర్టు భవన సముదాయంలో నూతనంగా నిర్మించిన చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు (పోక్సో నేరాల విచారణకు ప్రత్యేక కోర్టు) ప్రారంభోత్సవం బుధవారం పండగ వాతావరణంలో జరిగింది. స్థానిక బార్ అసోసియేషన్ హాలును రీమోడల్ చేసి పోక్సో కోర్టుగా తీర్చిదిద్దారు. హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు ఈ కోర్టును ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గుంటూరు జిల్లాకు చెందిన హైకోర్టు ఇతర న్యాయమూర్తులు జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ వెంకటేశ్వర్లు నిమ్మగడ్డ, జస్టిస్ వడ్డిబోయిన సుజాత, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపతో కలిసి వచ్చిన జస్టిస్ దుర్గాప్రసాదరావుకు జిల్లా జడ్జి వైవీఎస్‌బీజీ పార్థసారథి, తెనాలిలోని 11వ అదనపు జిల్లా జడ్జి సి.మాలతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, ఇతర న్యాయమూర్తులు, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఘనంగా స్వాగతం పలికారు. కోర్టుల ప్రాంగణంలోని న్యాయదేవత విగ్రహానికి నమస్కరించుకుని, ప్రత్యేక కోర్టు ప్రారంభోత్సవం చేశారు. అక్కడే సర్వమత ప్రార్థనలు జరిగాయి. జస్టిస్ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ, దాదాపు 16 మండలాలకు సంబంధించిన పోక్సో కేసులను ఈ కోర్టులో విచారణ చేస్తారని చెప్పారు. ఇక్కడ 200 కేసులకు పైగా పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం ఉందన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప మాట్లాడుతూ తెనాలితో తనకు గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. టీజే స్కూలులో చదివే రోజుల్లోనే కోర్టులను రోజూ చూసేదాన్నని చెప్పారు. జీవీ సీతాపతి న్యాయమూర్తిగా ఉన్న కాలంలో తాను న్యాయవాదిగా ఇక్కడే ప్రాక్టీస్ చేసినట్టు చెప్పారు. తెనాలిలో అడుగుపెట్టినప్పుడు సీనియర్ గురువులు కాజ వెంకట రామమోహనరావు లేని వెలితి బాధను కలిగించిందని చెప్పారు.

అసోసియేషన్‌కు ప్రత్యామ్నాయ హాలు కేటాయించాలి..

సభకు అధ్యక్షత వహించిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు మాట్లాడుతూ, ప్రత్యేక కోర్టు కోసం తమ అసోసియేషన్ హాలును త్యాగం చేసినట్టు చెప్పారు. ప్రత్యామ్నాయ హాలును కేటాయింపజేయాలని విజ్ఞప్తి చేశారు. సాధ్యమైనంత త్వరలో మీ కోర్కె నెరవేర్చేందుకు తనవంతు కృషిచేస్తానని జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు హామీనిచ్చారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ వెంకటేశ్వర్లు నిమ్మగడ్డ, జస్టిస్ వడ్డిబోయిన సుజాత, న్యాయమూర్తులు టి.రామచంద్రుడు, షేక్ అబ్దుల్ షరీఫ్, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ రహంతుల్లా, బార్ కౌన్సిల్ సభ్యుడు బ్రహ్మారెడ్డి, ఏపీపీలు దాట్ల మోహన్‌రెడ్డి, కోట రమేష్, ఎలిజెబెత్ రాణి, పరిశపోగు సునీల్, న్యాయవాదులు హరిదాసు గౌరీశంకర్, కంచర్ల చంద్రశేఖర్, జి.సీత, ఎంఎల్ జగదీశ్వరాంబ, అనిల్‌కుమార్, పి.సుధాకర్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే



నెహ్రూనగర్(గుంటూరు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. యువజన విభాగం అధ్యక్షుడిగా తాడికొండ నియోజకవర్గానికి చెందిన కళ్లం హరికృష్ణారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా తెనాలి నియోజకవర్గానికి చెందిన బూరెల నాంచారమ్మ, రైతు విభాగం అధ్యక్షుడిగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన ఉడుతూరి ఓం ప్రకాష్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా మంగళగిరి నియోజకవర్గానికి చెందిన దానబోయిన వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పొన్నూరు నియోజకవర్గానికి చెందిన పెరికల కృష్ణామోహన్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా మంగళగిరి నియోజకవర్గానికి చెందిన మేడా వెంకటేశ్వరరావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా తాడికొండ నియోజకవర్గానికి చెందిన సయ్యద్ అబీబుల్లా, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా మంగళగిరి నియోజకవర్గానికి చెందిన మునగాల మల్లేశ్వరరావును నియమించారు. వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడిగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన ఉదాగిరి మురళి, కల్చరల్ విభాగ అధ్యక్షుడిగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన చెరుకూరి సాంబశివరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా తెనాలి నియోజకవర్గానికి చెందిన జువ్వాజీ శ్రీనివాసరావు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా తెనాలి నియోజకవర్గానికి చెందిన నాలాది ప్రభాకర్, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన డాక్టర్ యకూబ్ షేక్, స్టూడెంట్ విభాగ అధ్యక్షుడిగా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన చిన్నబత్తిన వినోద్‌కుమార్, వికలాంగుల విభాగం అధ్యక్షుడిగా పొన్నూరు నియోజకవర్గానికి చెందిన ఎస్‌కే అల్లా బాషా, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన మాదాసు కిరణ్‌కుమార్ నియమితులయ్యారు.

జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ ప్రతిష్టకు కృషి చేయాలని, పార్టీ ఎల్లవేళలా వారికి అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కో–ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. బాధ్యతలు స్వీకరించనున్న నాయకులకు ఆయన అభినందనలు తెలియజేశారు.

పప్పు దినుసులను ఆర్బీకేల్లో విక్రయించండి



గుంటూరు వెస్ట్: రబీ 2022–23లో పండించిన పప్పుదినుసులను రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయనున్న వీటికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. క్వింటా శనగలకు రూ.5,335, పెసలకు రూ.7,755, మినుములకు రూ.6,600 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రైతులు తక్కువ ధరలకు దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వ సిబ్బంది రైతులకు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు.

పట్టభద్రులు, టీచర్ల ఓటర్ల జాబితా విడుదల

బాపట్ల: బాపట్ల జిల్లాలోని చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో ఉన్న పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ బుధవారం విడుదల చేసింది. జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు 26,372 మంది ఉండగా వీరిలో పురుషులు 17,626 మంది, మహిళలు 8,745 మంది, ఇతరులు ఒకరు ఉన్నారు. ఉపాధ్యాయుల ఓటర్లలో మొత్తం 1728 మంది ఉండగా వీరిలో పురుషులు 1065 మంది, మహిళలు 663 మంది ఉన్నారు.

శనగలకు రూ.5,335 మద్దతు ధర

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీ మార్క్‌ఫెడ్, జాతీయ సంస్థ నాఫెడ్ ద్వారా 2022–23 రబీ సీజన్‌లో రైతులు పండించిన శనగలు క్వింటా రూ.5,335 చొప్పున మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు తన అధ్యక్షతన సమావేశమైన జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ నిర్ణయించిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి ఒకటవ తేదీ నుంచి రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) శనగల కొనుగోలు కేంద్రాలు పనిచేస్తాయన్నారు. రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకొని పంటకు తగిన మద్దతు ధరను పొందాలని జాయింట్ కలెక్టర్ కోరారు.

టీడీపీ అలజడి సృష్టిస్తోంది

రాయపాటి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే రోశయ్య, ఎమ్మెల్సీ డొక్కా



గుంటూరు వెస్ట్: రాష్ట్రంలో శాంతి భద్రతలు తీవ్రంగా లోపించాయని, వెంటనే రాష్ట్రపతి పాలన పెట్టాలని మాజీ ఎంపీ, టీడీపీ నాయకులు రాయపాటి సాంబశివరావు వ్యాఖ్యలపై పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్‌లు తీవ్రంగా ఖండించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో రోశయ్య మాట్లాడుతూ ఏమీ లేకపోయినా ఏదో ఉందని భ్రమ కల్పించడంలో చంద్రబాబు అండ్ పార్టీకి వెన్నతోపెట్టిన విద్యన్నారు. గన్నవరంలో కేవలం పట్టాభి రెచ్చగొట్టే వ్యాఖ్యల కారణంగానే అక్కడ ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. పోలీసులు చాకచక్యంగా వ్యవవహరించి నష్టాన్ని నివారించగలిగారని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కావాలనే టీడీపీ నీచమైన కుయుక్తులకు పాల్పడుతోందన్నారు. డొక్కా మాట్లాడుతూ రాయపాటికి పూర్తి సమాచారం లేకపోవడంతోనే అలా అన్నారన్నారు. దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఏకీభవించనని చెప్పారు. సంక్షేమ పాలన దిశగా ముఖ్యమంత్రి ప్రయాణం కొనసాగుతోందని, ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలపై కాకుండా ఇలా వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం సరికాదని హితవు పలికారు.

బ్యాంకర్ల త్రైమాసిక పురోగతి ఆశాజనకం

- కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- వ్యవసాయానికి రూ.22,399 కోట్లు

గుంటూరు వెస్ట్: జిల్లాలో రైతులకు బ్యాంకర్లు అందించిన రుణాలు ఆశాజనకంగా ఉన్నాయని వీటిని మరింత పెంచాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన డీసీసీ, డీఎల్ ఆర్సీ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 31, 2022 నాటికి ముగిసిన త్రైమాసిక రుణ ప్రణాళికలు బాగున్నాయన్నారు. రైతులకు 22,399 కోట్ల రుణ లక్ష్యంగా నిర్ణయిస్తే 23,775 కోట్లు అందించారన్నారు. ప్రియారిటీ సెక్టార్‌లో 15,011 కోట్లు, నాన్ ప్రియారిటీ సెక్టార్‌లో 8,764 కోట్లు ఎంఎస్‌ఎంఈల కింద 6,094 కోట్లు అందించడం అభినందనీయమన్నారు. దీంతో పాటు కౌలు రైతులకు, విద్యార్థులకు విద్యా రుణాలు, టిడ్కో లబ్ధిదారులకు, చిరు వ్యాపారులకు కూడా రుణాలివ్వాలని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, నాబార్డ్ ఏజీఎం కార్తీక్, ఆర్బీ ఎల్‌డీఓ హనుమ కుమారి, ఎల్‌డీఎం ఈదర రాంబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌పీఎల్ రీజనల్ విజేతలు సర్ సీఆర్ రెడ్డి, ఎన్ఆర్ఐ

- ముగిసిన రీజనల్ క్రికెట్ పోటీలు
- సీనియర్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి
- జూనియర్ విభాగంలో ఎన్ఆర్ఐ విజయం
- నేటి నుంచి విజ్ఞాన్‌లో రాష్ట్ర స్థాయి మ్యాచ్‌లు

SAKSHI | సాక్షి | SAKSHI DIGITAL | MEDIA GROUP | SPL SAKSHI PREMIER LEAGUE | APMDC | APMDC FOUNDATION

చేబ్రోలు: సాక్షి ప్రీమియర్ లీగ్(ఎస్‌పీఎల్) రీజనల్ స్థాయి జూనియర్స్, సీనియర్ స్థాయి పురుషుల క్రికెట్ పోటీలు గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో బుధవారం ఉత్కంఠభరితంగా ముగిశాయి. రెండో రోజు నిర్వహించిన మూడు మ్యాచ్‌లలో ఆరు జట్ల మధ్యపోరు హోరాహోరీగా సాగాయి. రీజనల్ స్థాయి విజేతల బహుమతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజ్ఞాన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మీడియా ఏ గౌరిశంకర్‌రావు, గుంటూరు జిల్లా సాక్షి బ్రాంచి మేనేజర్ టీ గోపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ క్రీడాకారులు మాత్రమే వరల్డ్ చాంపియన్స్ అవ్వగలరని పేర్కొన్నారు. క్రీడల్లో రాణింపుతోనూ ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చున్నారు. శారీరక శ్రమ కలిగే విధంగా ఆటలు ఆడటం వలన విద్యార్థులకు ఆరోగ్యం లభిస్తుందన్నారు. క్రీడల ద్వారా ఎంతోమంది ఉన్నత స్థానాలకు వెళ్లి దేశ ప్రతిష్టను పెంచారని గుర్తు చేశారు. మానసిక ఉల్లాసం కోసం వ్యాయామం తప్పనిసరిగా చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మ్యాచ్‌లను గుంటూరు జిల్లా సాక్షి బ్రాంచి మేనేజర్ టీ గోపీ పర్యవేక్షించారు.

నాకౌట్ మ్యాచ్‌లో సర్ సీఆర్ రెడ్డి విజయదుందుభి

రీజనల్ మ్యాచ్ జూనియర్స్ విభాగంలో భాగంగా నిర్వహించిన నాకౌట్ మ్యాచ్‌లో సర్ సీఆర్ రెడ్డి(ఏలూరు) కాలేజీ విజయ దుందుభి మోగించింది. మొదట టాస్ గెలిచి సర్ సీఆర్ రెడ్డి టీమ్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన కల్లం హరనాథరెడ్డి(గుంటూరు) కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 63 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్ నందు 21 పరుగులు(2 ఫోర్లు, 1 సిక్స్)తో రాణించాడు. సర్ సీఆర్ రెడ్డి కాలేజీ బౌలర్ కే గణేష్ 3 వికెట్లతో మెరిశాడు. అనంతరం 64 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన సర్ సీఆర్ రెడ్డి కాలేజీ కేవలం 5 ఓవర్లలో 1 వికెట్ మాత్రమే కోల్పోయి 64 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సర్‌సీఆర్ రెడ్డి కాలేజీ బ్యాట్స్‌మెన్ ఎస్‌కే సాయి చరణ్ 36 పరుగులు(4 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో మెరిపించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.



ట్రోఫీని అందుకుని కేరింతలతో విన్నర్స్ ఎన్నారై జూనియర్ కళాశాల, విజయవాడ

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఎస్‌పీఎల్ మ్యాచ్‌లు

- సీనియర్స్ విభాగంలో సీకామ్ డిగ్రీ కాలేజ్ (తిరుపతి) వర్సస్ ఎంవీజీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (విజయనగరం)
- జూనియర్స్ విభాగంలో సాయి గణపతి కాలేజ్ (విశాఖపట్నం) వర్సస్ ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ (విజయవాడ)
- సీనియర్స్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ (ఏలూరు) వర్సస్ సీకామ్ డిగ్రీ కాలేజ్ (తిరుపతి)

జూనియర్స్ రీజనల్ విజేత ఎన్ఆర్ఐ

సాక్షి ప్రీమియర్ లీగ్ జూనియర్స్ విభాగంలో ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ(విజయవాడ) విజేతగా నిలిచింది. రన్నర్‌గా సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజ్(ఏలూరు) రన్నర్‌గా నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ బ్యాట్స్‌మెన్ కే రేవంత్ 53 పరుగులతో (5 ఫోర్లు, 1 సిక్స్) దుమ్మురేపాడు. అనంతరం 94 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 72 పరుగులు మాత్రమే చేసి 21 పరుగుల తేడాతో ఓటమి చెందింది. సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజ్ బ్యాట్స్‌మెన్, కెప్టెన్ కే సాయి చరణ్ 18 పరుగులు(2 ఫోర్లు) మాత్రమే రాణించాడు. ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ నలుగురు బౌలర్లు జాఫర్, ప్రకాష్, తేజదీప్, రేవంత్ తలో 2 వికెట్లు తీసి సమష్టి కృషితో విజయంలో కీలకపాత్ర పోషించారు. బ్యాటింగ్‌లో 53 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి ఆల్‌రౌండ్ ప్రతిభ కనపరిచిన ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ బ్యాట్స్‌మెన్ కే రేవంత్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రేవంత్ (50 పరుగులు)



జూనియర్ విభాగంలో విజేతగా నిలిచిన ఎన్నారై(విజయవాడ) జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న విజ్ఞాన్ రిజిస్ట్రార్ రఘునాథన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గౌరిశంకర్, సాక్షి బ్రాంచి మేనేజర్ గోపీ

సీనియర్స్ రీజనల్ విజేత సర్ సీఆర్ రెడ్డి



సీనియర్స్ విభాగంలో విజేత సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(ఏలూరు) జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న విజ్ఞాన్ రిజిస్ట్రార్ రఘునాథన్, సాక్షి బ్రాంచి మేనేజర్ గోపీ

సాక్షి ప్రీమియర్ లీగ్ సీనియర్స్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ(ఏలూరు) రీజనల్ విజేతగా నిలిచింది. రన్నర్‌గా ఎన్‌బీకేఆర్ఐఎస్‌టీ(నెల్లూరు) నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న సర్ సీఆర్ రెడ్డి కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. సర్ సీఆర్ రెడ్డి టీమ్‌లో నాగవెంకట తేజ 32(3 ఫోర్ల) పరుగులతో రాణించారు. ఎన్‌బీకేఆర్ఐఎస్‌టీ బౌలర్లలో మనోజ్, అమర్‌నాథ్ చెరో రెండు వికెట్లతో రాణించారు. అనంతరం 96 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఎన్‌బీకేఆర్ఐఎస్‌టీ కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 43 పరుగులు మాత్రమే చేసి 52 పరుగుల తేడాతో ఓటమి చెందింది. సర్ సీఆర్ రెడ్డి కళాశాల బౌలర్లు హేమంత్, ఉమేష్, మధు ఒక్కొక్కరు రెండు వికెట్లతో రాణించారు. 32 పరుగుల చేసిన నాగవెంకట తేజ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

27లోగా ఈ-పంట నమోదు చేసుకోవాలి

నరసరావుపేట రూరల్: రబీలో పంటలను సాగు చేసిన రైతులు ఈనెల 27వ తేదీలోగా రైతుభరోసా కేంద్రాల వద్ద ఈ-పంట, ఈకేవైసీ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో రబీలో ఇప్పటి వరకు 1,11,706 ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేసినట్లు తెలిపారు. అందులో 1,04,698 ఎకరాలను ఈ-పంట నమోదు చేయడం జరిగిందని చెప్పారు. గ్రామ స్థాయిలో వీఏఏ, వీఎస్ఏ, వీఆర్‌ఓలు 1,00,840 ఎకరాల విస్తీర్ణాన్ని ధ్రువీకరించినట్లు వివరించారు.

సాగర్ నీటి మట్టం 553 అడుగులు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 553.00 అడుగుల వద్ద ఉంది. ఇది 216.4350 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకి 10,200, ఎడమ కాలువకు 8,807, ఎస్ఎల్‌బీసీకి 1,650, వరద కాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 20,977 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 20,977 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 827.20 అడుగుల వద్ద ఉంది. ఇది 46.7456 టీఎంసీలకు సమానం.

పులిచింతల ప్రాజెక్టులో 42 టీఎంసీల నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.6707 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ నుంచి 1200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 200 క్యూసెక్కులు వదులుతున్నారు.

పశ్చిమకు 1902 క్యూసెక్కులు

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1902 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 20 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 264 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 262 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 10 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 185 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 900 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

యార్డులో 1,14,842 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,12,423 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,14,842 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.21,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 82,912 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

25న జిల్లా యూత్ అథ్లెటిక్ జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 25న ఉదయం 9 గంటలకు జిల్లా యూత్ అథ్లెటిక్ మీట్ నిర్వహిస్తామని కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చూపిన అథ్లెట్స్‌ను రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు. వివరాలకు 96666 35296 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

పవిత్ర పరలోకాన్ని ప్రసాదించేది క్రీస్తే

విజయపురిసౌత్: పవిత్ర పరలోకాన్ని ప్రసాదించేది క్రీస్తే అని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ అన్నారు. దేవాలయంలో శ్రమదినాలను పురస్కరించుకొని నిర్వహించిన దివ్యబలి పూజా కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి బుధవారం ప్రసంగించారు. ఈ రోజు నుంచి ఉపవాస కాలం మొదలవుతుందని చెప్పారు. ఈ 40 శ్రమల దినములను అందరూ ఆచరిస్తూ ఎక్కువ సమయం ప్రార్థనలో గడుపుతూ ఏసుక్రీస్తును ఆరాధించాలని కోరారు. ఏసుప్రభువు మానవుడై మన రక్షణకై శ్రమపడిన విధమును ఈ ప్రత్యేక దినమున జ్ఞాపకం చేసుకొనుట మనకెంతో ఆశీర్వాదమన్నారు. అనంతరం 14 స్థలాలలో భక్తులు ప్రదక్షిణలు చేసి ప్రార్థనలు చేశారు. ఆ తరువాత 40 రోజులు దీక్ష తీసుకునే భక్తులకు విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్, జోసఫ్ తంబి, బ్రదర్ అనిల్‌కుమార్ మాలలు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుగ్గెంపూడి ఇన్నారెడ్డి, జెక్కిరెడ్డి చిన్నపరెడ్డి, కె.శౌరారాజు, శౌరిబాబు, మరియదాసు పాల్గొన్నారు.

25న నరసరావుపేటలో మెగా జాబ్‌మేళా



నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్ సంయుక్త ఆధ్వర్యంలో 25వ తేదీ నిర్వహించనున్న జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ మాట్లాడుతూ పిడుగురాళ్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించనున్న మేళాకు ఎస్‌వీకే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆక్సిస్ బ్యాంక్, హెటిరో, కాలిబర్, అపెక్స్ సొల్యూషన్స్ తదితర 12 కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, బయోడేటాతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు వీరాంజనేయులు 9160200652, నాయక్ 9010585360, ప్రసాద్ 9866822697లను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బి.బాలునాయక్, జిల్లా ఉపాధి అధికారి ఎస్.పద్మ, ఐ అండ్ పీఆర్ డెప్యూటీ డైరెక్టర్ ఏఎస్ దీప్తి పాల్గొన్నారు.

పోలీసులు, హోంగార్డులకు కళ్లజోళ్ల పంపిణీ

భజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు (గుంటూరు): సమాజ శాంతి భద్రతల పరిరక్షణలో శ్రమిస్తూ నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడే పోలీసు ఉద్యోగులు, హోంగార్డుల సంక్షేమాన్ని కాంక్షించి నేత్రజ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని భజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీన నిర్వహించిన కంటి వైద్య పరీక్షలలో 1056 మంది పోలీసులు, హోంగార్డులు, వారి కుటుంబ సభ్యులు కంటి పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. వారిలో 781 మందికి కళ్లజోళ్లను పోలీసు పెరేడ్ మైదానంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ భజరంగ్ ఫౌండేషన్ కార్యక్రమాల్లో నేత్రజ్యోతి, నారీ రుతువు కార్యక్రమాలను పోలీసు ఉద్యోగులకు ప్రత్యేకించి చేయడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. భవిష్యత్‌లో పోలీసు శాఖ నిర్వహించే ఏ సేవా కార్యక్రమానికైనా సహకరించడానికి భజరంగ్ ఫౌండేషన్ సంసిద్ధంగా ఉంటుందని తెలిపారు. పలువురు పోలీసు అధికారులు మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో సొంత పనులను వాయిదా వేయడం సహజంగా ఏర్పడుతోందని, దీంతో వైద్య పరీక్షలు చేయించుకోవడంలో ఎంతో కొంత నిర్లక్ష్యం వహిస్తూ ఉంటామని, కానీ భజరంగ్ ఫౌండేషన్ పోలీసు ఉద్యోగుల పట్ల శ్రద్ధ వహించి భజరంగ్ నేత్రజ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించి కంటి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించడమే కాకుండా వారం లోపే కళ్లజోళ్లు అవసరమైన వారికి ఉచితంగా పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. ఫౌండేషన్ ఎంతో చక్కటి సహకారాన్ని అందించి వైద్య పరీక్షలు నిర్వహించారని కొనియాడారు. ఈ సందర్భంగా భజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ, సభ్యులు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.


అరండల్‌పేట సబ్ ఇన్‌స్పెక్టర్ అనురాధ మాట్లాడుతూ పనుల ఒత్తిడిలో డ్యూటీలో ఒత్తిడిలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసే తమవంటి ఉద్యోగులకు ఇటువంటి వైద్య పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లను అందించిన ఫౌండేషన్ సామాజిక దృక్పథం అభినందనీయమన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ థామస్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసులు ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో ఎంతో శ్రమిస్తుంటారని వారి కష్టాన్ని గుర్తించి వారికి వైద్య సేవలను అందించడం కోసం భజరంగ్ నేత్రజ్యోతి కార్యక్రమం ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి, కళ్లజోళ్లను అందించడం సంతోషకరమని అన్నారు.



కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్న సీఈఓ అంబటి మురళీకృష్ణ

శతాధిక వృద్ధురాలు మృతి

తాడికొండ: 110 సంవత్సరాల శతాధిక వృద్ధురాలు నాగళ్ళ వీరమ్మ మృతి చెందిన ఘటన తాడికొండలో జరిగింది. 107 సంవత్సరాలు ఆరోగ్యంగా తిరిగిన ఈమె గత మూడు సంవత్సరాల క్రితం మంచంలో పడగా బుధవారం తుదిశ్వాస విడిచింది. భర్త వెంకటరెడ్డి మరణించి చాలా కాలం అవుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఆమెకు ఒక కుమార్తె, మనుమరాలు ఉందని, అరుపదుల వయసులోనే కాలం చెల్లుతున్న ఈ రోజుల్లో శతాధిక వృద్ధురాలిగా నూరేళ్లు పూర్తి చేసుకున్న ఆమెకు పలువురు నివాళులర్పించారు.



నాగళ్ళ వీరమ్మ(110)